
# విజయనగరం జిల్లా
# గరివిడి యాజీ ఎడ్యుకేషనల్ (Y.E.S) సొసైటీకి కృతజ్ఞులం




**మ**నకు కనిపించే ప్రత్యక్షగ్రహాలు సూర్యుడు, చంద్రుడు. ప్రకృతికి పక్షపాత రహితంగా వెలుగును ప్రసాదించే ప్రత్యక్ష క్రా(కా)ంతి దేవతలు ఈ ఇరువురిలో చేతులెత్తి మొక్కించుకొనే దేవుడు సూర్య భగవానుడు. చేతులు చాచి కౌగిలించు కునేంత ఆనందం పులకింపచేసేవాడు చంద్రుడు. ఈ దేవతల పవిత్ర సంస్కృతిని ప్రజ్వలింపచేస్తున్న యజ్ఞవల్కుడు, సూర్యో పాసనా పరంపర వంశ పారంగతుడు శ్రీ సూర్యసదన, సూర్యపీఠ, సూర్యభాసురా మానమైన ధర్మపురుషుడు. దత్త పీఠబంధు ధర్మసింధు, యాజీ ఎడ్యుకేషనల్ (Y.E.S) సొసైటీ అధి పురుషుడు **పరమ పూజ్య సద్గురు కృష్ణ యాజీగారి దివ్యమంగళ శుభాశీస్సులతో.**

గరివిడి (శ్రీకాకుళం జిల్లా) **యాజీ ఎడ్యుకేషన్ సొసైటీ** వారు ప్రదానం (Sponsor) చేసిన నందన సంవత్సర ప్రారంభ 'ప్రముఖాంధ్ర' ను మీకు అందిస్తూ ట్రస్టు చైర్మను, ముఖ్య ట్రస్టీయైన **శ్రీ వేమకోటి సూర్యనారాయణ శర్మ** గారికి కృతజ్ఞాతాభివందనములు తెలియ చేస్తున్నాం.

విత్తమును చిత్తముకు అంటనీయని నిర్మలచిత్తుడు. సద్గురు కృష్ణయాజి సవివర, సపూర్వక వ్యాసము ఏప్రిల్ సంచిక నుంచీ నందించగలమని తెలియచేస్తున్నాం.

**తెలుగువారిలో ఎంతో ఉదారగుణ సంపన్నులున్నారు. ప్రభుత్వం చేయని మంచి పనులు చేస్తున్నారు. మాతృ భాషకూ, ఆర్షధర్మానికి చిత్తశుద్ధితో ప్రముఖాంధ్ర చేస్తున్న సేవను గుర్తించి, శ్రేయః స్వభావంతో ప్రోత్సహించమని కోరుతున్నాం. ప్రపంచంలోని తెలుగువారందరికీ చెందిన, పత్రిక ప్రముఖాంధ్ర ఒక్కటే.**




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మార్చి 2012

సంపుటి : 18 **207** సంచిక : 3




# అభారతీయతను పెంచుతున్న గాంధారీ పుత్రులు

## దేశవనరులను ఛిన్నాభిన్నం చేయడానికే వారు పుట్టారు!

గంగిగోవు పాలు గరిటుడైన చాలు, కడివిడైననేమి ఖరము పాలు అన్నట్లుగా, నూరుమంది శూరులైన గాంధారీ పుత్రులుండీ, ధర్మగుణశీలురైన ఐదుగురు పాండవులు లేకపోవడం భారతదేశం చేసుకున్న దురదృష్టం.


ప్రపంచ దేశాలన్నిటికీ ఐశ్వర్యం, జ్ఞానం, విజ్ఞానం నేర్పి గురుస్థానంలో ఉన్న భారతదేశం ఇప్పుడెన్నో స్థానంలో ఉన్నదో చెప్పడానికి నా 'కలం' సంకోచిస్తూన్నది. కలియుగంలో ప్రవేశించవలసిన 'కలి' ముందుగా భారతదేశంలోనే ప్రవేశించాడా అనే సంశయం మెండగుతున్నది.

కలియుగంలో ధర్మం ఒంటి పాదంతో నడిచినప్పటికినీ, అధర్మం స్వైర్యవిహారం చేయలేదు. మొగల్ చక్రవర్తులూ, బ్రిటీష్ సామ్రాజ్యవాదులూ ధనసంపదను దోచుకున్నారుగాని, ధర్మసంపదను దోచుకోలేదు. మహ్మద్ ఘోరీ, గజనీ మహ్మద్ వంటి మతమౌఢ్యులు దేవాలయాలను దోచుకున్నారు, శిల్ప సంపదను నాశనం చేసి, బంగారు నగలను దోచుకున్నారే తప్ప, జ్ఞాన సంపదను దోచుకోలేదు. వ్యవసాయ పాడి ఫలక్షేత్రమైన భారతదేశం సిరిసంపదలను పంచుతూ పెంచుతూనే వచ్చింది. భారతపుణ్యభూమిని ముక్కోటి దేవతలూ భారతీయుల మనోమయ, జ్ఞానమయ, ఆనందమయ కోశాలకు ఖేదం కలుగనీయలేదు, బేధం చోటు చేసుకోనివ్వలేదు. ప్రాచీన భారతపురాణేతిహాసాల్లో సనాతన ధర్మం గురించి ప్రస్తావించారే తక్క 'మతం' అంటూ మనిషిని ఒక రాటకు కట్టిపడేయలేదు. ప్రాక్పశ్చిమ దేశాలవారూ, ముఖ్యంగా హూణులూ, ముస్లిములు సువిశాల భారతదేశాన్ని, హిందూ దేశంగానూ, దేశ పౌరులను హిందువులుగానూ భావించి, ఆ పేరును స్థిరనామకరణం చేసారు. ఆచార్యులుగానీ, గురువరేణ్యులు గానీ, జ్ఞానం మూర్తీభవించిన పెద్దలుగానీ ఆ పదాన్ని ధిక్కరించకపోవడం వలననే హిందూమతమైనది. సిద్ధాంతపరంగా చూస్తే హిందూమత మూల వృక్షం సనాతన ధర్మం! వివిధ వర్గాలుగా చీలిపోయిన విభిన్న భాషల వారిని అద్వైత ప్రచారంతో ఆదిశంకర భగవత్పాదులు సనాతన ధర్మ విశిష్టతను ప్రామాణికంగా చాటారు. ఆయన ఏ దేవుడూ, దేవతలనూ ద్వేషించలేదు, దూషించలేదు. బుద్ధుడు కూడా సత్యం వద, ధర్మం చరనే ప్రధానధర్మంగా అంగీకరించారు. 'సత్యమేవ జయతే'- అన్నారు. స్వామి వివేకానంద, దయానందసరస్వతి, ప్రభుపాదులు (ఇస్కాన్) ప్రభావంతో భారతదేశానికి విలువ పెరిగింది. హిందూ మతానికి ప్రాచుర్యం కలిగింది.

కానీ స్వాతంత్ర్యానంతరం హిందూ మతాన్ని ద్వేషించేవారు, సంపదలను దోచుకునే వారూ పెరిగారు. పౌర సమాజంలో మతాలూ, కులాలూ, ప్రాంతాలుగా విభేదాలు సృజింపబడ్డాయ్. రాజకీయపార్టీలు కారణంగా దైవభక్తి లోపించడం, ముష్కరులకన్నా ఎక్కువగా దోచుకోవడం, వ్యవసాయిక దేశం యాంత్రిక దేశంగా మారడంతో బుద్ధులు కూడా యాంత్రికంగా మారిపోయాయి. త్యాగశీలురూ, సత్యశీలురూ ఎప్పుడైతే అంతరించారో దేశధర్మం కాస్తా అపుడే అదృశ్యమైంది.

అర్థరాత్రి వేళ తిరగకలిగే 'స్త్రీ' ఆ భాగ్యత శక్తిని కోల్పోయింది. చిన్న చేపను పెద్దచేప, పెద్దచేపను తిమింగలం ఇలా ఇలా ఒకరికొకరు పోటీపడి దేశాన్ని పగటి దొంగలుగా దోచుకుంటూ హేయమైన బ్రతుకును బ్రతుకు తున్నారు, తల్లిపాలు త్రాగుతూ రొమ్ము గుద్దేవారవుతున్నారని చెప్పడానికి సిగ్గుగా ఉన్నది. దీనికి వారు నింద్యులనే కన్నా, ప్రజల్నే నింద్యులని చెప్పడానికి సాహసిస్తున్నాను.

ఈలా అంగుళం మేరకొక గాంధారీ పుత్రుడున్న కారణంగా అభారతీయత పెరుగుతుంది. అధఃప్రమాణపు మానవత పెరిగి, ఉన్న కాస్తా నాలుగో పాద ధర్మం కూడా నశించే ప్రమాదము పొంచి ఉన్నదని భయపడుతున్నాను. నందన నామ సంవత్సరమూ నీవైనా సకల జనులకు ఆనందం ప్రసాదించవమ్మా!



బుధజన విధేయుడు

గోటేటి శ్రీరామారావు

> **"ఓ నందననామ ఆనందనామ సంవత్సరమా! త్వాముష్ట శోక నరాభీష్ట మధుమాస సముద్భవ నిబావశోక సంప్తాం మామశోకం సదాకురు!"** జీవితంలో దుఃఖాలతో బాధపడ్తున్న మేము నిన్ను సేవిస్తున్నాం. మధుమాసంలో చిగురించినా అశోకమా! మమ్ము శోక (అశోక) రహితులను చేయుమమ్మా!


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# 'నందన' నవనందనమా! నవపారిజాతమా రావమ్మా!



ప్రకృతికీ ఓ పుట్టిన రోజు ఉన్నది. ఏ ఏడాదికా ఏడాది ఏదో మంచి జరుగుతుందని మనతోబాటు ప్రకృతీ భావిస్తూనే ఉంటూంది. ప్రకృతీ సౌందర్య రక్షణ పురుషుని మీద, పురుషుని సుఖ బాధ్యతల పరిరక్షణ ప్రకృతి' మీదా ఆధారపడింది. ఈ తులాదండంలోని సమసూత్రం ననుసరించి ప్రకృతీ పురుషులు సమబాధ్యతల్ని దక్షతతో, పరస్పర రక్షణతో ప్రవర్తించిననాదు యావత్ప్రాణికోటీ సుఖశాన్తులతో విలసిల్లగలదని బ్రహ్మ ఈ సృష్టిని పన్నగశయనుని ఆదేశంతో ప్రారంభించాడు. ఆయనే సద్గురువు, (తరువాయి 6వపేజీలో)

# ఉగాది పండుగ రోజున ఆచరించవలసిన పంచవిధులు

## అభ్యంగన స్నానము

సంవత్సరాది యందు సూర్యోదయానికి ముందే బ్రహ్మ ముహూర్తంలో తలంటు స్నానం చేయాలి. ఇందుకు ఒళ్లంతా నువ్వు నూనె పట్టించి, మర్దన చేసుకొని, ఉసిరికాయ, పెసరపప్పు, మాను పసుపు, బావంచాలు, ఖర్జూరాలు మొదలైన ద్రవ్యాలతో చేసిన సున్నిపిండితో ఒళ్లు రుద్దుకుని, కుంకుడుకాయ నానవేసిన వేడినీళ్లతో కుంకుడుకాయ పులుసు తలకు రాసుకుని, గోరువెచ్చని నీటితో శుభ్రంగా స్నానమాచరించాలి. అటుతర్వాత బొట్టు, ఆభరణాలు, కొత్త దుస్తులు ధరించాలి.

## పుణ్య కాలానుష్ఠానము

అభ్యంగన స్నానమాచరించిన తర్వాత సూర్యోదయం కోసం వేచివుండి, సూర్యుడు ఉదయించడంతోనే సూర్యునికి పుష్పాంజలి, అర్ఘ్యము, దీపం, ధూపం అర్పించి ఆరోజు నుంచి ఆచరించవలసిన వ్యవహారములకు సంబంధించి నూతన సంకల్పం చేయాలి.

## వేపపచ్చడి తినడం

పరగడుపున వేపపూత పచ్చడి తినాలి. ఉగాది పచ్చడిలో వేపపూత, వేపగుళ్లు అశోకచెట్టు ఆకు గుళ్లు కూడా ఉపయోగించుకోవచ్చు. వీటితో బాటు పొంగించిన ఇంగువ, బెల్లం, కొబ్బరి, సైంధవ లవణం, చింతపండు, మిరియాల పొడి, పటికబెల్లం (చెరకు లేదా తాటిబెల్లం) వాము (ఓమ), జీలకర్ర, మంచి పసుపు వీటినన్నింటినీ తగిన ప్రమాణంలో తీసుకుని కలిపి, బాగా నూరి, రోజుకు 3 నుంచి 6 గ్రాముల వరకు ఉగాది రోజు మొదలు చైత్రపూర్ణిమ వరకు తినాలి.



అలా కాకుంటే కనీసం మొదటి తొమ్మిది వసంత రాత్రులైనా తినాలి. అయితే కాలక్రమేణా ఈ శాస్త్రీయమైన ఉగాది పచ్చడి చింతపండు పులుసులో బెల్లం, మామిడికాయ ముక్కలు, కొబ్బరి ముక్కలు, వేప పువ్వుతో ఉగాది పచ్చడిని తినాలి. ఈ ఉగాది పచ్చడిని ఆంధ్ర ప్రాంతంలో గట్టిగా నూరిన పచ్చడిలా చేస్తుండగా, తెలంగాణాలో చారులా పల్చటి ద్రవంలా తయారు చేయడం ఆనవాయితీగా ఉన్నది.

## ధర్మకుంభదానం

దీనినే కలశపూజ అంటారు. దీనివల్ల రానున్న సంవత్సరాల్లో అన్ని కోరికలూ సిద్ధించి, పూర్ణ మనోరథులౌతారని భావించవచ్చును. దానికోసం రాగితోగాని, పంచలోహలతోగానీ మట్టికుండనుగానీ, రంగులతో అలంకరించి, అందులో పంచపల్లవములు అనగా అయిదు రకాల గుళ్లు మామిడి, అశోక, నేరేడు, మోదుగ, వేప కలిపిన నీటిని పోసి, సుగంధ చందనమును కలిపి, పుష్పాక్షతలు వేసి, ఆవాహనము చేసి పుణ్యమంత్రాలతో పూజచేసి, నిలబెట్టి కలశానికి ఒక కొత్త వస్త్రాన్ని చుట్టి కలశంపై పసుపు, కుంకుమ, చందనం పూసి పసుపు దారాలతో అలంకరించిన కొబ్బరి బొండం నుంచి, పూజా కలశాన్ని గురువుకు గానీ, పురోహితునికి గానీ గుడిలో విష్ణుమూర్తి లేదా యజ్ఞపురుషునికి గానీ దానమిచ్చి వారిని నూతన వస్త్రాలు, దక్షిణలతో సత్కరించి వారి ఆశీస్సులు పొందాలి.

## పంచాంగ శ్రవణం

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం ఈ అయిదింటిని కలిపి పంచాంగం అంటారు. తిథి వల్ల సంపద, వారం వల్ల ఆయుష్షు, నక్షత్రం వల్ల పాప పరిహారం, యోగం వల్ల వ్యాధి నివృత్తికరణం వల్ల కార్యానుకూలము కలుగుతాయి. కాలం తెలిసి కర్మం చేయు ఆస్తికులు భగవదనుగ్రహం పొందుతారు. పంచాంగ శ్రవణం వల్ల కలిగే పుణ్యం భూమి, బంగారం, ఏనుగులు, గోవులు, ఉత్తమ కన్యదానములు చేస్తే కలిగినంత ఫలితంతో సమానం అంటారు. సంవత్సరాధి పతులైన రాజు, మంత్రి, సేనాధిపతి, సస్యాధి పతి, ధాన్యాధిపతి, అర్ఘ్యాధిపతి, మేఘాధిపతి, రసాధిపతి, నీరసాధిపతి అనే నవనాయకుల యొక్క గ్రహఫలితాలను శాస్త్రోక్తంగా వినడం వల్ల గ్రహదోషాలు నివారణై, వినేవారికి ఆరోగ్యము, ఆయుష్షువృద్ధి చేస్తాయి. సంపద, శుభఫలితాలు కలుగుతాయి. నవగ్రహాలను ధ్యానించుట వల్ల కలిగే శుభఫలితాల వంటివే రానున్న సంవత్సరంలోని ఏయే ఆధిపత్యాలు, ఏయే గ్రహాలకు లభిస్తున్నాయో దానిని వరించడం వల్ల ఆ గ్రహాల యొక్క తేజస్సు మన యందు కల్గును. శాస్త్రవిధిగా, పంచాంగ శ్రవణం చేసినవానికి, వినిపించిన వారికి సూర్యుని వల్ల శౌర్యం, తేజస్సు, చంద్రుని వల్ల భాగ్యం, వైభవం, కుజుని వల్ల సర్వ మంగళములు, బుధుని వల్ల బుద్ధివికాసం, శుక్రుని వల్ల సుఖం, శని వల్ల దుఃఖరాహిత్యం, రాహువు చేత ప్రాబల్యం, కేతువు వల్ల తన వర్గంలో ప్రాముఖ్యత కల్గుతాయి.

**ఉగాది నాడు ఆచరించే పంచవిధి విశేషాలన్నీ సంపూర్ణ ఆయురారోగ్యాలను అందచేస్తాయి.**

**ముద్రారాక్షసం (అచ్చుతప్పులు) నుండీ తప్పించుకోలేకపోతున్నాం!**

(5వపేజీ తరువాయి) ఆయనే జగద్గురువు. అందుకే ఓ కవిచంద్రుడు '**ప్రకృతీ పురుషులు ఒకటేనని పరమరహస్యము చాటావూ! సద్గురు బోధను వినకున్నావూ** అన్నాడు.

విరోధి, ప్రకృతి, ఖర నామ సంవత్సరాల ప్రభావంతో ప్రజలందరము పడరాని కష్టాలు పడ్డాం. ఇరుగు పొరుగుల ద్వేషాలూ, ఇంటి దొంగల దోపిడీలు, వావివరుసలు మరిచిన కామవికారులు, విద్యార్థుల వికటాట్టహాసాలు, ఉపాధ్యాయుల కామకేళీలు, తల్లీ, తండ్రీ, గురువూ, భార్యా పుత్రులనే బంధాలను మరిచి హత్యలూ, గుడి హుండీ దోపిడీలు, దేవతా విగ్రహ దోపిడీలు, నగల అపహరణ, భ్రూణహత్యలుతో భారతదేశం భుగభుగమని సెగలు రేపింది.

**వచ్చేవన్నీ మంచిరోజులనుకుంటేనే తప్ప, మనిషి ఆశావాహంగా జీవించలేడు.** కావున ఈ మార్చి నెల 23 బుధవారం ప్రభవిస్తున్న తెలుగు యుగ – ఆది నందన నామ సం॥రము కావడం, పేరులోనే నవ ఆనందం సంతరించడం శుభస్కరంగానే ఉన్నది. సంవత్సరంలోని పన్నెండు నెలలూ ప్రజలందరికీ ఆనందం కలుగచేస్తుందని విశ్వసిద్దాం!

**ఆనందదాథరాజస్రం ఫలాడ్యా ఫలసంచయైః**
**నందనాబ్దే చహా నిస్స్యూత్కోశధాధాన్య వినాశనమ్**

– ఈ నందన నామ సం॥ము నందు పుడమి సర్వఫల సంపన్నత నొసగుచూ సంతోషం కలుగచేస్తున్నదిగా ఓ ఆశను అంకురింపచేస్తున్నది. ఈ సంవత్సరపు నవనాయకఫలముల్లో రాజు, మంత్రి, సేనాధిపతి, అర్ఘాధిపతి, మేఘాధిపతి శుక్రుడే అయిదు శాఖల నాయ'కు'డు కావడంతో శుభఫలితాలను ఆశించవచ్చని సూచనప్రాయంగా **బుట్టే వీరభద్ర దైవజ్ఞ** కూర్చిన సంవత్సర ఫలం తెలియచేస్తూన్నది. సస్యాధిపతి చంద్రుడు, ధన్యాధిపతి రవి, రసాధిపతి బుధుడు నీరసాధిపతి చంద్రుడు కావడంతో 'సస్యశ్యామల కోమలంగా పుడమి పాడిపంటలతో, ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా విలసిల్లగలరనెడు వార్త ఆనందం కలిగిస్తూన్నది.

**దోచేవాడు దోచుకోకుండా, దాచేవాడు దాచుకోకుండా ఉంటే సంపద పదిమందికీ అందుతుంది!**

ఆదిశంకర భాగవత్పాదులు పుట్టినది ఈ నందన నామ సంవత్సరమే కావడంతో, ఎవరో ఒక పుణ్య పురుషుడు ఈ ధరపై పుట్టకుండా ఉండదు. దోషపూరిత గ్రహణములున్న సంకేతం లేదు. ఇదే మార్చి నెలాఖరు రోజు 31వ తేదీన శ్రీరామనవమి కావడంతో ఈ మార్చి నెల జనుల తలరాతలో మంచి మార్పులు తెస్తుందని విశ్వసిద్దాం.

ఉగాది అంటే ప్రకృతి, సృష్టి పుట్టిన రోజు. బ్రహ్మకల్పం ప్రారంభమైనప్పుడు తొలిగా పుట్టిన సంవత్సరం 'ప్రభవ' తొలి మాస చైత్రం, తొలి ఋతువు వసంతం, తొలి తిథి పాడ్యమి, తొలి రోజు ఆదివారం, తొలి నక్షత్రం అశ్వని. అదే మాసం నవమి తిథినందు, పునర్వసూ నక్షత్ర ఘడియలో సకల ధర్మపరుడు, ప్రజాభీష్టపు ధర్మ రాజ్యాధినేత శ్రీరామచంద్రుడు జన్మించాడు.



ఆనందమానందమాయే నందన ఆనందమే!

# 'క్లీం' అనే బీజాక్షర స్మరణతో మహాలక్ష్మి అనుగ్రహం పొందిన సుదర్శనుడు!


అమ్మ ఆదిశక్తి, అమ్మలనుగమ్మ ఆ అమ్మకు కరుణ అపారం. తెలిసో తెలియకో చేసిన దివ్యనామ స్మరణకు ప్రసన్నమై సర్వసంపదలిస్తుంది.

అడిగితేనే పెట్టేది అమ్మ, అడగకనే పెట్టేది జగదమ్మ. బాల్యమున తండ్రి యుద్ధంలో గతించడంతో సుదర్శనుడు దిక్కులేనివాడయ్యాడు. అడవులపాలై భరద్వాజముని ఆశ్రయం చేరాడు. తోటి ఆశ్రమ పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఎంత మరిచినా తాను రాజుకుమారుడననే మాట మనసులో దొలుస్తూంది. తల్లీతండ్రీ ఉనికీ లేనివాణ్ణి అమ్మలకు అమ్మయిన జగదమ్మ చూస్తుందనే విశ్వాసమొకటి అతనికున్నది. 'అమ్మ'ను యెలా కొలువాలో సుదర్శనునకి తెలియదు. అడవిలో తోటి బాలలతో ఆడుకుంటూండగా, ఎవరో తన్ను 'క్లీబుడా' యని పిలవడం విన్నాడు. ఎందుకో సుధాకరునికి 'క్లీబుడా'లోని మొదటి అక్షఋం ఏదో వింతగా తోచింది. ప్రతీ అక్షరానికీ ఏదో ముగింపు కావాలి కదా. వెంటనే అమ్మ జ్ఞాపకం వచ్చింది; అంత్యాక్షఋమూ 'అం'యే కదా! అప్రయత్నంగా ఆ రెండిటినీ కలిపి 'క్లీం' అన్నాడు. నోటికదెంతో రమ్యంగా, మధురంగా, రసరంజమైన శబ్దంగా తోచింది.

వెంటనే సుధాకర్ తన్మయత్వంతో 'క్లీం', 'క్లీం' అంటూ పదే పదే మననం చేసుకుంటూ **క్లీం** అంటూ ప్రారంభించాడు. ఆ 'క్లీం' మహాలక్ష్మి సంకేతమైన బీజాక్షఋమని అతనికి తెలియదు. ఆ బీజాక్షఋోపాసనం వలన సకల సంపదలు కలుగుతాయనీ, తన్ను మెచ్చే రాచకన్య వివాహమాడుతుందనీ, అది కామరాజ బీజమనీ సుధాకరుడెరుగడు. తదేక ధ్యానంతో, స్థిరచిత్తంతో 'క్లీం' జరిపించడం వలన గరుడ వాహనమ్మీద, వైష్ణవీ శక్తి గల లక్ష్మీదేవి ప్రత్యక్షమయింది. 'వత్సా మెచ్చాను' అంది.

అబేధ్యమైన కవచం, ధనుర్బాణాలూ, అశ్వాన్నీ ప్రసాదించింది. సుబాహు వనే రాజు కుమార్తెతో నీకు పరిణయమవుతుంది. పోయిన రాజ్యం వశమవు తుందని ఆశీర్వదించింది. దేవీ పలుకులు వృధా కాలేదు. తండ్రి పోగొట్టుకున్న రాజ్యం సంపాదించాడు. 'క్లీం' బీజాక్షరం శక్తివంతమని గ్రహించాడు. ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

## తెలుగు సాంప్రదాయ ఆహార్యం కట్టూ, బొట్టూ, చీర, రవికా - తెలుగు నుడి పలుకులు 'అమ్మా' - 'నాన్నా' పిలుపులూ

# మలేషియా తెలుగు మహిళా జాతిరత్నాలు

## - యావత్ప్రపంచంలో తెలుగు 'స్త్రీ'యే గర్వకారణమైన ఉన్నదిగ నిరూపించారు! -

*మనం తెలుగు కట్టూబొట్టూ, చీర, రవిక, పిల్లలయితే పరికిణీ గౌనూ, పైన పమటకండువా వేసుకున్న తెలుగు ఆడవాళ్ళను చూచి అర్థశతాబ్దం అవుతూన్నది. 'అర్థా-ంగీ' అన్నందుకు అర్థ శరీరమే కప్పేట్టు అంగీలు (వస్త్రాలు) మన దేశంలో ధరిస్తున్నారు. పేగు తెంచుకు వచ్చిన మాతృ వాత్సల్యంతో, 'అమ్మా' అనీ పితృ వాత్సల్యంతో 'నాన్నా' అని పిలిచే రోజులు పోయి 3 దశాబ్దాలు అయ్యింది. మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ నాగరికమైంది.*

*నిప్పులో కాలనీ, నీటిలో నాననీ, గాలిలా ఎగిరిపోయేది 'ప్రేమ' యనిగానీ, వాత్సల్యమనీ అనలేము. గగనాలూ, భువనాలూ ప్రేమనే పంచమన్నాయ్, జననం సంభవించినపుడు మోదమూ, మరణం సంభవించినపుడు ఖేదమూ మరిచిపోయాం అనడానికి బదులు యాంత్రికులం అయిపోయాము అనుకుంటున్న దశలో- మలేషియా తెలుగు మహిళల సంప్రదాయ, సదాచారాలను గూర్చి-మలేషియా వాసీ. 'ప్రముఖాంధ్ర' అభిమాని అల్లుసుబ్రహ్మణ్యం గారు పంపిన 'మలేషియా తెలుగు మహిళల సాంప్రదాయ, కట్టూబొట్టులను గూర్చి చదవడంతో మలయ మంజుల మారుత వీచికలను అనుభవిస్తూన్నంత ఆనందం కలిగింది. ఆనందమే కదా జీవితమకరందం. ఒకటిన్నర శతాబ్దముల క్రిందట, ఆకాసయానం లేని రోజుల్లో, నీలిసాగర జలాల్ని దాటి వెల్లినమా, సాంప్రదాయ హద్దుల లక్ష్మణరేఖల్ని దాటని ఆ లలనామణుల్ని గూర్చి, ఒక్కసారి తెలుసుకుందాం!*



### "స్త్రీ"

**ఆత్మీయతలో..........అమ్మ**
**సహనంలో..........భూదేవి**
**అణకువలో...........అనసూయ**
**పట్టుదలలో..........సావిత్రి**
**కరుణలో..........థెరిస్సా**
**ప్రేరణలో..........మాంచాల**
**వీరంలో..........ఝాన్సీరాణి**
**పౌరుషంలో..........రాణిరుద్రమ్మ**
**అవసరమైతే..........ఆదిశక్తి...కూడా యవుతుంది.**

అటువంటి "స్త్రీ"శక్తికి అభివందనములుచేస్తున్నాను. ఏ ఇంట్లో స్త్రీ గౌరవింపబడుతుందో ఆ ఇల్లు నందనవనమవుతుంది. ఏ దేశంలో స్త్రీలు గౌరవింపబడుతున్నారో ఆ దేశం సస్యశ్యామలంగా ఉంటుంది. అందుకనే ఒక కవి "స్త్రీ" ని గురించి ఇలా ప్రస్తుతించారు.

**"బ్రతుకు ముల్లబాటలోన ... జతగా స్నేహితురాలవైతివి,**
**కన్నీళ్లు తుడిచే వేళ ... తోడబుట్టిన చెల్లెలవైతివి,**
**జీవితంలో వెనుకబడినప్పుడు ... వెన్ను తట్టిన భార్యవైతివి,**
**పురిటినొప్పుల బాధ తెలియని పురుషజాతికి ... తల్లివైతివి.**
**"కష్టంలో ముందుండి ... సుఖంలో క్రిందుండి ...విజయంలో వెనకుండి ... ఎల్లప్పుడూ పక్కనుండేదే ... స్త్రీ". (గోటేటి)**

ఇటువంటి 'స్త్రీ శక్తి' ని గురించి అందులోనూ ప్రత్యేకంగా మలేషియాలోని తెలుగు మహిళల గురించి వ్రాసే అవకాశం నాకిచ్చిన "మలేషియా తెలుగు సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రీమతి ధనలక్ష్మి గారికి" నా కృతజ్ఞతలు అంటున్నారామె.

ప్రశాంతమైన, సుందరమైన, సుసంపన్నమైన మలేషియా దేశానికి మన తెలుగువారు 150 సంవత్సరాల క్రితం బ్రిటీషు పాలనలోనే "ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం, అమలాపురం, శ్రీకాకుళం" జిల్లాల నుండి వ్యవసాయ కూలీలుగా వలస వెళ్లారు. వలస కూలీలుగా

(తరువాయి 8వ పేజీలో)

## మలేషియా - మహిళా - కార్యకర్తలు



### మాదం మదిని రాములమ్మ సోమనాయుడు

మదిని సోమనాయుడు అనగానే మలేషియా తెలుగు సంఘం స్ఫురణకు వస్తుంది. శ్రీమతి మాదం మదిని 74 సంవత్సరాల వయసులో కూడా మలేషియా తెలుగు మహిళాభ్యున్నతికి కృషి చేస్తున్నారంటే ఆమె వంశ రక్తంల్లోంచి పెల్లుబికిన తెలుగు మమత. ఆమె అనన్య కృషితో మలేషియా తెలుగు మహిళా భవనం వెలిసింది. మహిళల్లో తెలుగు విద్యాభ్యాసనలు మొలకెత్తాయ్. స్త్రీ విద్యకు ఆమె చేసిన కృషి అపారం.

### మాదం అప్పల నరసమ్మ

71 సం॥ముల వయసు గల అప్పల నరసమ్మ తెలుగుతనానికి ప్రతీక. పుణ్య స్త్రీ వదనం, పసుపు కుంకుమ, వైష్ణవత్వం ఈమె వదనంలో పరిఢవిల్లుతుంది. సింపాంగ్ ఎంపాటీ పేరక్‌లో జన్మించిన ఈ మహిళా శిరోమణి అలుపెరుగని సేవలను చేస్తున్నారు. సంక్రాంతి, ఉగాది పండుగలను తెలుగు మహిళా మణులందరితోనూ కూడి చేస్తూ, తెలుగుతనాన్ని తెలుగుదనంగా మార్చుకున్న మహిళా సేవకురాలు. ఇంకా మాదం లచ్చమ్మ, మాదం బతుమల కృష్ణ వంటి మహిళానాయకీమణులెందరో తెలుగుతనం, తెలుగుభాష, తెలుగుసంస్కృతి పల్లవించడానికి అహరహం కృషి చేస్తున్నారు.



(4వ పేజీ తరువాయి)

స్వదేశాన్ని, స్వంత ఊరిని, స్వంత వాళ్ళను, వదిలి, చంకల్లో చంటి పిల్లలతోను, సద్ది మూటలతోను, ట్రంకు పెట్టెలతో ఓడలనెక్కి వచ్చి మలయ దేశంలో స్థిరపడిన తెలుగు కుటుంబాల సంతతే నేడు మలేషియాలో నివసిస్తున్న 5 లక్షల మంది తెలుగువారు.

ఆనాడు భర్తల వెంట, తండ్రుల వెంటవచ్చిన మన తెలుగు మహిళలు విద్యావంతులు కారు. శరీర కష్టం చెయ్యడం మాత్రమే తెలిసిన సామాన్య స్త్రీలు. ఉదయం లేచి మగవారితో పాటు రబ్బరు, కొబ్బరి తోటలలో కూలి పనులకు వెళ్ళి రాత్రి వరకు కష్టపడి పని చేసి, ఇంటికి వచ్చి వంటా వార్పులు, పిల్లల బాగోగులు చూసుకొని, వచ్చిన అతి తక్కువ ఆదాయములోనే సగం పొదుపు చేసి ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేసారు. తెలుగువారు అధికంగా ఉన్న తోటలలో తెలుగుబడులకు తమ పిల్లలను పంపి తెలుగు భాషను నేర్పించారు. రాత్రి వేళలలో రామభజనలు, జానపద గీతాలు పాడుకుంటూ మన సంస్కృతిని మలేషియాలో నిలబెట్టారు.

150 సంవత్సరాల క్రితం మలేషియాకి వచ్చిన మన తెలుగువారు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బ్రిటీష్‌పాలనలో వీరు తోటపనులే కాకుండా, 'సయాం'కు రైలుబాట వేసే పనులకు మగవారిని తీసుకొని పోగా ఆడవారు ఒంటరిగా మిగిలి పలు ఇక్కట్లకు గురయ్యారు. ఇంకనూ జపాన్ వారితో యుద్ధ సమయంలో బాంబులదాడికి గురవుతూ, పనులు లేక, తినడానికి తిండి లేని సమయాలలో మహిళలు తోటలలో దుంపలు ఏరుకువచ్చి అవి ఉడికించి పిల్లలకు పెట్టి వారిని కాపాడు కున్నారు. "కష్టాల కోర్చుకున్ననే సుఖాలు దక్కును" అన్న విధంగా ఆనాటి ఆ మహా తల్లులు ఎన్నో కష్టాలకోర్చి, ఎంతో పొదుపుగా జీవనం సాగించి, ఆర్థికంగా నిలదొక్కు కుంటూ ఒక్కొక్క కుటుంబంలోనూ పదిమంది పిల్లలున్నా చాలా ముందుచూపుతో వారంద రిని విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో వారు చూపిన పట్టుదల, కృషి, నిజంగా ప్రశంస నీయము.

వారు చదువుకోకపోయినా ముందు చూపుతో సమయానికి తగు నిర్ణయాలు తీసుకొని వారి కుటుంబాలను నిలబెట్టుకొని నేడు మలేషియాలోని తెలుగు వారందరు విద్యావంతులుగాను, డాక్టర్లుగాను, లాయర్లుగాను, ఇంజనీర్లగాను, వ్యాపారవేత్తలుగా, ఉన్నతాధికారులుగా ఉండే తెలుగు సమాజాన్ని రూపొందించారు.

అలా అంచలంచెలుగా ఎదిగిన ఈ నారీశిరోమణులు అన్నీ రంగాలలోను తమ సాధికారతను చాటుకుంటూ నేడు మలేషియాలో తెలుగు మహిళందరూ మగవారితో సమానంగా "ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్" అన్నట్లుగా అన్నీ విద్యలు నేర్చి నేడు డాక్టర్లుగా, టీచర్లుగా, కంప్యూటర్ ఇంజనీర్లుగా, అకౌంటంట్లుగా, ఆడిటర్లుగా ఎన్నో ఉద్యోగాలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ఇంటిని, పిల్లలను సరిదిద్దుకుంటూ వస్తున్నారు. మలేషియాలో నేడు నూటికి 70% మంది తెలుగు మహిళలు, ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇది నిజంగా తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం.

మలేషియా తెలుగు మహిళలు 150 సంవత్సరాలుగా ఆంధ్రదేశానికి దూరంగా ఉంటున్నా, వారు ఆంధ్రదేశం వదలి వచ్చేటప్పుడు పాటించిన అదే సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ తెలుగుదనాన్ని కాపాడు తున్నారు. నేడు మనం ఆంధ్రదేశంలో కుడివైపు పవిటలతో చీరలను కట్టుకొనే వారిని చాలా అరుదుగా చూస్తాము. కాని ఇక్కడ ప్రతి తెలుగు మహిళా వారి ఊరి (అనకాపల్లి, అమలాపురం, విశాఖపట్టణం, శ్రీకాకుళం) అలవాటు ప్రకారం ఈనాటికి కుడివైపు పమిటల్నే ధరిస్తారు. ఎన్నో మిశ్రమ విదేశి సంస్కృతుల మధ్య జీవనం సాగిస్తున్నా నేటికి కూడా పండుగలకి మన అచ్చ తెలుగు వంటకాలైన 'బూరెలు, అరిసెలు, పొంగడాలు, చిన్ని పోకలు, తీపిగారెలు' వంటివే కాకుండా మినపజావ, వాముచారు, మెంతులుపులుసు, వంటి ఆరోగ్యకరమైన సంప్రదాయకరమైన తెలుగు వంటలను నోరూరించేలా చేస్తారు. పాశ్చాత్య సంస్కృతి, పరభాషలు తెలుగువారి జీవన శైలిలో కలిసిపోయి 'అమ్మ, నాన్న' అని పిలవడమే మన తెలుగువారు మరిచిపోయిన ఈ రోజులలో కూడా మలేషియా తెలుగు వారు ఇంతవరకు ఆ సంస్కృతిని దరిచేర నివ్వక వారి పిల్లలతో **అమ్మ, నాన్న** అని పిలిపించుకుంటూ వారి ప్రతి అడుగుతోనూ తెలుగుదనాన్ని చూపుతున్నారు. ఇంకనూ నేటి మహిళలు వారి అమ్మలు, అమ్మమ్మలు దగ్గర నేర్చుకున్న జానపదనాట్యాలైన చిరతలాట, దాటుభజనలు, గొబ్బిళ్ళ ఆటువంటి నాట్యాలను వారి పిల్లలకు నేర్పడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

అడుగడుగునా ఆత్మవిశ్వాసంతోను, అచంచలమైన కృషితోను, ధృడ సంకల్పం తోను, అన్నీ రంగాలలోను స్త్రీ సాధికారతను చాటుతూ ప్రగతి పథం వైపు నడుస్తున్న ఈ మహిళామణులు నేడు (జనవరి 28,2012) మలేషియా తెలుగువారి చరిత్రలో ఎప్పుడు జరగని విధంగా 2000 మందికి పైగా ఒక చోట సమావేశమై ఒక మహాసభను జరుపు కుంటూ తమ భాషాభిమానాన్ని చాటు కుంటున్న వీరిని అభినందించాలి.

**"తెలుగుని పెంచుదాం, తెలుగుని ప్రేమించుదాం,**
**తెలుగుదనం మనకు ధనం, తెలుగుజాతి చరిత ఘనం."**
**జై తెలుగు తల్లి.**

**– దుర్గప్రియ (మలేషియా)**

**తల్లులు తలచుకుంటే తెలుగు భాష అలవడదా?**

**మలేషియా తెలుగు మహిళలకు తెలుగు భాషపైనున్న అభిమానం అపారమైంది. ఎన్ని పనుల ఒత్తిడిలో నున్నా ఈ తెలుగు తల్లులు వారి పిల్లలను మలేషియా తెలుగు సంఘం వారు నిర్వహిస్తున్న తెలుగు తరగతులకు, తెలుగు నీతి శిబిరాలకు, పంపి తెలుగుభాషా, సంస్కృతులను నేర్చుకునేలా చేస్తున్నారు. చిన్న తనం నుండే వారి పిల్లలు అచ్చమైన తెలుగువారిగా పెరుగుతున్నారు.**

**ఉత్సాహవంతుడూ, మాతృ (తెలుగు) భాషపై అపారమైన ప్రేమగల మలేషియా తెలుగు సంఘ అధ్యక్షుడు డా॥ అచ్చయ్య కుమార్‌రావు 2012 సం॥ డిసెంబర్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్యతో కలిసి ప్రపంచ తెలుగు మహాసభలు జరుపాలనే యత్నం ప్రారంభించారు.**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

ఋష్య శృంగేరి

# ఎంతో ప్రశాంతత, ప్రకృతీ పచ్చదనాల మధ్య పవిత్రతను సంతరించుకున్న పుణ్యక్షేత్రం

ఋష్యశృంగుని జన్మస్థలిగా పిలువబడే శృంగేరి కర్నాటక పశ్చిమ కనుమల్లో మంగుళూరుకి 150 కి.మీ., బెంగుళూరుకి 336 కి.మీ.ల దూరంలో ఉంది. ఆదిశంకర భగవత్పాదుల వారు అద్వైతసిద్ధిని ప్రచారం చేస్తూ ఎనిమిదవ శతాబ్దంలో శృంగేరి వచ్చి, అక్కడ నెలకొల్పిన శారదాపీఠం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఏట శారదా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. హరిత గిరుల మధ్య నెలవై, అపూర్వ శిల్పచిత్రకళ అలరారే పావన ధర్మక్షేత్రం శృంగేరీ!

శృంగేరి చిన్న గ్రామం. ఇది ఉడిపి పట్టణానికి తూర్పుగా అందమైన పడమటి కనుమలలో నెలకొని ఉంది. రైలు సౌకర్యం లేదు. బస్సులో ప్రయాణిస్తూ శృంగేరి చేరుకోవాలి. షిమోగా, ధర్మస్థల, ఉడిపిల నుంచి నేరుగా ఇక్కిడికి బస్సులున్నాయి. మేం ఉడిపిని దర్శించుకుని శృంగేరి బయలుదేరాం. బస్సు ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. చుట్టూ అరణ్యం. మధ్యలో బస్సు దారి. అక్కడక్కడా బస్సు ఆగుతుంటుంది. కాని అక్కడ గ్రామమనేదే ఉండదు. ఒకరిద్దరు బస్సు దిగుతారు. దిగి అడవిలో కలిసిపోతారు. అంటే లోపల ఎక్కడో వారి గ్రామం ఉందనుకోవాలి. ఉడిపి నుండి శృంగేరికి 95 కిలోమీటర్లు. మేం ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరితే 11 గంటలకు శృంగేరి చేరుకున్నాం.

## శిల్పచాతుర్యం-శారదామాత మందిరం


శృంగేరి బస్సు నిలయానికి శారదామాత ఆలయం వంద గజాల దూరంలోనే ఉంది. ఆలయానికి దగ్గరే సత్రం ఉంది. పక్కనే తుంగానది ప్రశాంతంగా ప్రవహిస్తూంటుంది.

ఆదిశంకరాచార్యులు నిత్య పూజల కోసం శారదాదేవి విగ్రహాన్ని మంచి గంధం కర్రతో చేయించుకున్నారు. ఆ తరువాత విద్యారణ్యస్వామివారు చందన విగ్రహం స్థానంలో సువర్ణ విగ్రహం తయారుచేయించి ప్రతిష్ఠించారు. విశ్వవిఖ్యాతమైన హంపీ విజయనగర సామ్రాజ్యం విద్యారణ్యుల ఆశీస్సులతోనే స్థాపన జరిగింది.

శారదామాత మందిరం విమాన భాగం ఎర్రరాయితో అటు గుండ్రంగానూ, ఇటు నలుచదరంగానూ కాకుండా కోణలు, కోణాలుగా వుంది. లోపల ముఖ మంటపం పెద్దగా, విశాలంగా ఉంది. ప్రతి స్తంభంపైన అద్భుతమైన శిల్పాలు, చెక్కడాలున్నాయి. అమ్మవారి గర్భగుడి నల్ల చలువరాయితో నిర్మించబడి ఉంది. అద్భుతమైన శిల్పచాతుర్యంతో నిగనిగ మెరిసే గర్భగుడిలో తళతళ మెరిసే ఆభరణాలతో శారదామాత విగ్రహం మనోహరంగా మనసును పులకింపచేస్తూ ఉంటుంది.

## కాలచక్రం... అద్భుతం

అదే ప్రాంగణంలో కుడివైపున విద్యాశంకర ఆలయం ఉంది. ఆలయ నిర్మాణం అమోఘం. శ్రీవిద్యాశంకరుల వారికి కృతజ్ఞతగా శ్రీ విద్యారణ్యస్వామి క్రీ.శ. 1338లో ఈ ఆలయం నిర్మింపచేసారు... ఈ మందిరాన్ని అమరశిల్పి జక్కన శిల్పీకరించాడు. ఆలయ నిర్మాణంలో చోళ, ద్రవిడ సంప్రదాయ రీతులతో పాటు, కర్ణాటకను పాలించిన హొయసలుల శిల్పరీతి కనిపిస్తుంది. ఆలయ ముఖ మంటపంలో ఉన్న పన్నెండు స్తంభాలు కాలచక్రంలోని పన్నెండు పేర్లు కలిగి వున్నాయి. సూర్యుడు సంవత్సరం పొడవునా ఒక్కొక్క మాసం మొదట్లో ఒక్కొక్క రాశిలో ప్రవేశిస్తుంటాడు. సరిగ్గా అదేరోజున ఆ సూర్యకిరణాలు ఆ రాశిపేరు గల స్తంభంపైన ప్రసరిస్తాయి. ఖగోళ, వాస్తు శాస్త్రాలలో ఎంతో ప్రతిభ ఉంటే తప్ప ఇలాంటి ఆలయ నిర్మాణం అసాధ్యమని మేధావుల అభిప్రాయం. ఆలయ స్తంభాలపైన శార్దూల ఆకారాన్ని పోలిన దేవతా మృగపు విగ్రహాలు, వాటి నోట్లో నుండి వేలాడే బంతులూ, పైకప్పు నుండి ఊగిసలాడే




రాతి గొలుసులూ, అన్నీ ఏకశిలా నిర్మాణాలే. విద్యాశంకర ఆలయం బయటి భాగం కూడా వినూత్నంగా ఉంది. మొత్తం గోడలన్నీ కోణాలు కోణాలుగా వున్నాయి. పొడవైన రాతి పలకల్ని తెచ్చి ఒకదానికి మరొకటి అతికించినట్లుగా బ్రహ్మాండమైన శిల్పకళ ఉట్టిపడుతుంటుంది.

ప్రాంగణం వెనుకవైపు ఆదిశంకరాచార్యులవారి ప్రథమ శిష్యుడైన సురేశ్వరుని మందిరం, శ్రీరామ, హనుమ విగ్రహాలు ఉన్నాయ్, తుంగానది వెడల్పు ఉండదు. అయితే ఇందులో పెద్ద పెద్ద చేపలు ఒకదాన్ని ఒకటి ఒరుసుకుంటూ తిరుగాడుతుంటాయి. ఆలయ ప్రాంగణం నుండి తుంగానది అవతలి వైపునకు





శృంగేరీ శారదాదేవి

చేరుకోవడానికి వీలుగా వంతెన నిర్మించబడింది. అక్కడ రకరకాల చెట్లతో 'నారాయణవనం' ఉన్నది. ఆ వనంలోనే శృంగేరి పీఠాధిపతి నివాసగృహం ఉన్నది. ఆలయ నిర్వాహక కార్యాలయం, ఇంతకుముందున్న పీఠాధిపతుల మూర్తులు గల మ్యూజియం ఉన్నాయి. అవన్నీ చూసి తరించగల దివ్యక్షేత్రం శృంగేరి.

## నలువైపులా నాలుగు మఠాలు

శంకరాచార్యులవారు దేశంలో విస్తృతంగా పర్యటించి ఆనాటి సమాజంలో వేళ్లూనుకుని ఉన్న అర్ధరహిత మైన ఆచారాలు, సంప్రదాయాలను ఖండించారు. అద్వైత సిద్ధాంతాన్ని దేశమంతటా ఆమోదించేటట్లు చేయగలిగారు. తన తదనంతరం కూడా సనాతన వేద ధర్మం వర్ధిల్లాలనే తపనతో దేశంలోని నాలుగు ప్రదేశాలలో నాలుగు మఠాలు నెలకొల్పారు. తూర్పు ప్రాంతం లోని పూరి క్షేత్రంలో గోవర్ధన పీఠం, ఉత్తర ప్రాంతంలోని బదరీనాథ్‌లో జ్యోతిర్పీఠం, పశ్చిమ ప్రాంతంలోని ద్వారకలో కాళికపీఠం, దక్షిణ ప్రాంతంలోని శృంగేరిలో శారద పీఠం నెల కొల్పారు.

## ప్రశాంతతకు నిలయం శృంగేరి

శృంగేరిలో బస్సుల శబ్దంకాని, ఆటోల దొడ కాని వినిపించవు. జన సంచారం పల్చగా ఉండే ప్రశాంత వాతావరణం శృంగేరి ప్రత్యేకత. పెద్ద సైజు మైదానంలా ఉండే ఆలయ ఆవరణ. ఆవరణ వెనుక కొండల వరుస. దట్టమైన అరణ్యంలా కనిపించే పోక, కొబ్బరితోటలు, వీటి మధ్య సన్నగా పారే తుంగానది, అన్నీ కలిసి ఒక అద్భుత లోకం లోనికి ప్రవేశించిన అనుభూతి మనకు కలుగుతుంది. కాశీలోని గంగానదిలో స్నానం చేసి విశాలాక్షి అమ్మవారిని పూజించి, శృంగేరి చేరుకుని తుంగ (భద్ర)లో నీరు తాగి శారదామాతను పూజిస్తే పుణ్యం అంటారు. ప్రశాంతమైన వాతావరణంలో రెండు మూడు రోజులు గడపాలనుకునే వారికి అనువైన అందమైన పవిత్ర ప్రదేశం ప్రకృతి ప్రేమికులకు, భక్తులకు అందరికీ దర్శనీయమైన దివ్యస్థలం.

– నల్లబెల్లి శ్రీమన్నారాయణ

*If you want Comfortable Stay-*
*Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# శ్రీ విద్యారణ్యులు - ధర్మ పరిరక్షణ

శ్లో॥ జయతు జయతు తుంగా తీరగా శారదాంబ
జయతు జయతు శ్రీమత్ చంద్రమౌళిసురేస్యః
జయతు జయతు విఘ్నేరత్నగర్భో గణేశః॥
చైతన్యం శాశ్వతం శాంతం వ్యోమాతీతం నిరంజనం
నాదబిందు కళాతీతం తస్మై శ్రీగురవే నమః
భారతీ కరుణాపాత్రం భారతీపద భూషణం
భారతీ పదమారూఢం భారతీతీర్థమాశ్రయే॥



శ్రీ శంకర భగవత్పాదులు అవతరించు కాలమునాటికి మన హిందూ దేశము యొక్క అందలి నీతి, మతముల యొక్క స్థితి గతులు అవ్యవస్థగా, చిందరవందరగా ఉండెడివి. బౌద్ధ మత ప్రాబల్యముచే వేదప్రమాణము ప్రజలు అంగీకరించరయ్యె. దుష్ట ఆచార వ్యవహారములు, వామాచారములు, శాక్తగణాపత్యాదులు శీఘ్ర సంస్కరణావసరము వెల్లడించినవి.

సత్ఫలితముగా సాక్షాత్తు జ్ఞానైశ్వర్యరూపమగు శ్రీ దక్షిణామూర్తి అంశతో శ్రీశంకరులు అవతరించిరి.

శ్లో॥ మఠాశ్చత్వార ఆచార్యా! చత్వారశ్చధురంధరా
సంప్రదాయాశ్చచత్వార ఏషాధర్మవ్యవస్థితః

దేశములో చతుః దిక్ చతురామ్నాయ పీఠములను శంకరాచార్యులు స్థాపించి ధర్మమును పునః ప్రతిష్ఠించిరి.

అందు ఆదిపీఠము శ్రీ శృంగేరి శారదా పీఠము **"తస్యయజురేవ శిరః"** అను శ్రుతి ప్రమాణమును అనుసరించి, ఇది యజుర్వేద మహోత్కృష్ట పీఠము. నాటి నుండి నేటి వరకు అవిచ్ఛిన్న గురుపరంపరా విద్యమానమై వెలుగొందుచు, అద్వైత తత్వ ప్రచారమను మహోపకారము చేయుచున్నది.

ఈ పీఠమునకు పదియవ ఆచార్యులగు శ్రీ విద్యాశంకరతీర్థుల మహిమాతిశయములు మెండు. ఈ శ్రీవారిని సాక్షాత్తు పరమేశ్వరునిగానే భావించెడువారు. శ్రీసాయణాచార్యులు, శ్రీమాధవాచార్యులు తాము వ్రాసిన వేదభాష్యము మొదలగు గ్రంథములందు "వేదములు ఎవరి నిశ్వాసమో ఎవరు వేదముల మూలముగా జగత్తును సృష్టించిరో అట్టి శ్రీ విద్యాశంకర రూపియైన శ్రీపరమేశ్వరునికి నమస్కారము అని మొదట వీరిని స్తుతించి ప్రారంభించిరి. శ్రీవారు వేద, శాస్త్ర జ్ఞానముతో బాటు యోగము భక్తి జ్ఞానము మొదలగు సమస్త ఆత్మజ్ఞాన విద్యలలో అపార ఘనపాండిత్యము కలిగి సాక్షాత్తు అవతారపురుషుని వలె వెలుగొందిరి. నూరేండ్లకు పైగా మహాయోగ నిష్ఠులుగా శ్రీ శృంగేరి శారదా పీఠమును తేజో భరితము చేసి నిర్వహణ గావించిరి. చివరకు లంబికా యోగమున సమాధినిష్ఠులై భూమి అడుగున అంతర్గృహములో శాశ్వతముగా నుండునట్లు సంకల్పించుకొనిరి. నేటికినీ శ్రీవారు యోగనిష్ఠలో ఉన్నట్టే విశ్వసించబడు చున్నది. మఠము నుండి వెలువడు శ్రీముఖములన్నింటిలోను "శ్రీ విద్యాశంకర" అను ముద్రనే వాడుట నేటికిని ఆచారము– సాంప్రదాయము. శ్రీజగద్గురువుల బిరుదావళిలో "శ్రీ విద్యాశంకర పాదపద్మారాధక" అను బిరుదు నుదహరిస్తున్నారు. ఇప్పటికిని ప్రతిరోజు రాత్రి వేళలందు దేవతాగణములు వచ్చి ధూపదీప నివేద్యాదులతో శ్రీవారిని పూజించుచుందురనియు, తత్సమయములో ఘంటనాదము గూడ వినబడుననియు ప్రసిద్ధి. కాదు కాదు సాక్షాత్తు జరుగు చున్నట్లు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద శివాభినవనృశింహ భారతీ మహాస్వామివారు తాము రచించిన "భక్తి సుధా తరంగిణి"లోని శ్రీవిద్యా శంకర స్తోత్రమునందు వర్ణించుట చేత తాము స్వయముగా అనుభవించి యుందురనుటలో సందేహం లేదు.





# మీ ఇంట్లో చినపాపని!
# మీ కంట్లో కనుపాపని!
# చేజేతులారా చిదిమేయకండి!

'గోచేటి'

ప్రపంచంలో ఎక్కడా లేని స్త్రీ అభిమానం, అతివాత్సల్యం, పూజ్యభావం భారతదేశంలోనే ఉన్నది. మాతృదేశం మదర్‌లాండ్, మాతృభాష మదర్ లాంగ్వేజ్, మాతామహుల ఇంట్లో పుట్టడం వంటివి మన(సు) దేశంలో విరసిన విరజాజులు. పరిమళించిన పారిజాతాలు, కుసుమించిన కుసుమపరాగాలు. జననం కూడా అమ్మ ఇంట్లోనే జరుగుతుంది. అమ్మమ్మ తాతయ్య లాంటి వారు చూచాకనే తండ్రి ఇంటివారికి జనన శుభవార్త తెలియడంతో, నాన్నా, తాతా, బామ్మా, అన్నా, అక్కా అందరూ వచ్చి చూస్తారు. బంధువులు వచ్చి చూస్తారు.

అందుకే అమ్మ తరువాత అమ్మమ్మ, తరువాత తాతయ్య, నాన్న, మామయ్య, బావలు, పినతండ్రులు, పినతల్లులు అందరూ వస్తారు. ఆ పుట్టినరోజు మంగళవారంగానీ, శుక్రవారంగానీ అయితే మహాలక్ష్మి పుట్టిందంటారు. ఇక ముద్దులే ముద్దులు! ముద్దులుతో పాపబుగ్గలే ఎరుపెక్కిపోతాయ్. సొట్టబుగ్గలతో సొల్లుగారుస్తూ, నవ్వుతూన్నా మురిసి ఒరిసిపోతాం.

**ఆట ముద్దు పాట ముద్దు**
**అమ్మాయి నోటగల అన్నం ముద్దే ముద్దు**
**ముద్దులన్నీ అమ్మాయికీ సుద్దులన్నీ**
**అబ్బాయికి – ఎవరైనా ముద్దేనమ్మా ముద్దు**

– అనే పాపల పట్ల కల ముద్దు ముచ్చట్లు మ్రగ్గిపోతున్నాయ్.

మంగళ, శుక్రవారములందు ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందంటాం. ఆ తల్లి తండ్రులకూ, పుట్టింటి మెట్టింటివారికీ, ఇంట్లోనివారికీ ఆనందమే ఆనందం. తల్లి మురిసిపోతూ – ఊహ నెరింగి, చిట్టి చిట్టి అడుగులు వేస్తూ, చిలక పలుకులు పలికే ఆ పసిపిల్లకు గోరుముద్దలు పెడుతూ – రేపల్లెలోని గోపాలుడల్లె, మా యింటి పాపాయి ఆనందాల ముల్లె' అని పొంగిపోతూ – పాపాయి ఆడంగ ముద్దు పాడంగ ముద్దు, నట్టింటి పాపాయి నవ్వంగ ముద్దు' అంటూ మురిసిపోతుంది. అన్నమాచార్యలాంటి వాగ్గేయకారుడు కూడా కృష్ణుణ్ణి తలుచుకుని 'ముద్దుగారే యశోద ముంగిట ముత్తెము వీడు' అన్నాడు. ఆ చిట్టి పిల్ల కేఁమనిపించిందో – కొండెక్కి పూలు తెచ్చి చుట్టవే, అమ్మ నన్ను గోపాలకృష్ణుడనవే' అంటూ అమ్మబుగ్గపై ముద్దెడుతుంది. అప్పుడే ఊహలు గుసగుసలాడుతున్నాయన్న మాట. అమ్మ ఆనందంతో కందిపోతుంది, అపుడంటుంది;

**అమ్మణ్ణి ముద్దును ఏమన్నారు?**
**అప్పుడు కాచిన నెయ్యన్నారు!**
**కందిపప్పు ముద్దన్నారు!**
**కాటుక పెట్టిన కన్నన్నారు!**
**లేత మామిడి చిగురన్నారు!**
**లేగంటావుల పెరుగన్నారు!**
**అందరు మెచ్చిన ముద్దన్నారు**
**అప్పాల పండన్నారు!**

అయినా తల్లికి ముద్దు తీరదు, బిడ్డ మారాము చేస్తూ అన్నం తినదు.

**అయినా తల్లి విసుక్కోదు, కసురుకోదు!**
**చీమచీమా! చిట్టి చీమా ఎక్కడికెళ్ళావు?**
**చిట్టిపాప పుట్టినరోజు విందుకెళ్లాను!**
**విందుకెళ్ళి చిట్టి చీమ ఏఁవి చేసావు?**
**చిట్టిపాప బుగ్గపైనా ముద్దు పెట్టాను!**
**తల్లి ఆ మాట నందుకుని**
**ముద్దూ మురిపెము నీవంతయితే**
**చిట్టి పాప నోటివంతూ పెరుగూ బెల్లం ముద్దంట** – అనగానే ఆ పిల్ల నోరు తెరుస్తుంది. తల్లి ఆం అంటూ నోట ముద్ద పెడుతుంది.

**మేము – బుజబుజ రేకుల పిల్లుందా**
**బుజ్జారేకుల పిల్లుందా –**

అంటూ గౌనులేసే పిల్లలకు క్రౌను వేసి, బాలరాణుల్ని చేసి ఆడించేవాళ్లం. బడినుంచీ ఇంటికి రాగానే **'వచ్చావమ్మా బంగారు మాణిక్యాల తల్లీ ఆట మాణిక్యమే పాట మాణిక్యం మా యింటి అమ్మాయి రత్న మాణిక్యం –** అంటూ స్వాగతంలా పలికి, కాళ్ళూ చేతులూ కడుక్కున్న తరువాత, బొజ్జేడుస్తుందమ్మా అంటూ ఓ తాయిల్లం, బొజ్జేడుస్తుందమ్మా అంటూ ఇంకో తాయిల్లం,

గ్లాసుడు పాలూ యిచ్చి, పిల్ల త్రావి స్థిరపడ్డ తరువాత ఆనాటి పాఠాలను వల్లె వేయించే వారు

అంటి ఉమ్మడి కుటుంబాలు కాబట్టి ఇంట్లోని బామ్మలు, తాతలు, అన్నలు, అక్కలు, వదినలు ఉంటే మేనత్తలు, మేనమామలు సకల బంధుగణం సహితమూ తలకో ముద్దు యిచ్చి, ఎత్తుకునేవారు, పనివాళ్లు పాపమ్మగోరు, అమ్మాయిగోరు అంటూ తనివితీరని ఆనం దాన్ని అందించేవారు.

> *ఆ ముద్దులను మరిచిపోయి, కుక్కపిల్లలనూ పిల్లి పిల్లలనూ పెంచుకుంటున్నారు. మగపిల్లలైతే ఫరవాలేదనుకుంటున్నారు. కుక్కను ముద్దు చేస్తే మూతెల్లా నాకుతుంది. పిల్లిని ముద్దు పెట్టుకుంటే వేళ్లగోరులతో గీరుతుంది. లేగదూడను ముద్దు చేస్తే కాలెత్తి తన్నుతుంది. వెల్తురిచ్చే జ్యోతి కదాయని ముద్దిస్తే మూతి కాలుతుంది. ఒక్క పాపయే ముద్దుకు ముద్దిస్తుంది!*

ఆ ముద్దుగుమ్మనెన్ని ముద్దులు పెట్టేవారో?

ఆడపిల్ల ఆటలు ముద్దు, పాటలు ముద్దు, చెప్పే కథలు ముద్దు, బుంగమూతి వేషం ముద్దు, బూరి బుగ్గలు ముద్దు, భాషణలు ముద్దు, గురుదైవాలకు పెట్టే దండం ముద్దు, చదువులు ముద్దు, సఖ్యం ముద్దు, అందం చందం ముద్దు, అందరితో పొత్తు ముద్దు, ముద్దు పాప ముల్లోకములకు ముద్దు. పిల్లలూ, పాడి, ఉంటే ఇంటికే ముద్దు.

పులి, పిల్లి ఒక జాతివైనా ఒకరి పిల్లల్ని ఒకటి ముద్దుపెట్టుకోవు. కాకి కోకిలా ఒకే రంగూ, ఆకారంలో ఉన్నా వాటి పిల్లలు కావని తెలియగానే తరి మేస్తాయ్. చిలుక తన ముద్దే తక్క ఎదుటి ముద్దుకు ఇష్టపడదు. ఒక్క గోవు మాత్రమే మలమూత్రాలతో ఉన్న దూడ మలినాన్ని నాలుకతో నాకి తుడిచివేస్తూ పాలును కుడవనిస్తుంది. అందుకే ఆవును వాత్సల్యంగల 'అమ్మ' జాతిలో చేర్చారు.

## భ్రూణహత్యలు

కానీ 'అమ్మ' స్థానంలో ఉన్న ఆడది స్త్రీ సుకుమారత్వాన్ని మరిచింది. పేగుబంధాన్ని మరిచింది. కడుపులో పెరుగుతున్న 'శిశువు' ఆడశిశువు అనగానే గర్భస్రావం చేసుకుంటూ చంపేస్తున్నది. ఒకవేళ స్త్రీ శిశువు పుట్టి భూమ్మీద పడితే చెత్తబుట్టల్లోనో, చెరువుల్లోనో, కాలువల్లోనో, ఏ చెట్టు పొదల్లోనో పడవేస్తున్నది. అలా పడేసిన శిశువులకు ఆయుఃప్రమాణం దీర్ఘంగా ఉంటే ఎవరో ఒకరు పట్టి అనాథాశ్రమాలకూ, ఊయల పథకాలకూ చేరుస్తున్నారు. లేదా ఆ పసికూనలను కుక్కలూ, పందులూ పట్టిపీకి తినేస్తున్నాయ్.

సైన్సు వెర్రిగా పెరిగి మన దేశాన్ని ఎంత అకలావికలం చేస్తున్నదో చెప్పలేకున్నాం. డాక్టర్లు లింగనిర్ధారణ స్కానింగ్ చేయడం ప్రథమ తప్పు. చట్టం అట్టివారికి చుట్టంగా ఉండి చూస్తూ ఉండడం మరో తప్పు. కామంతో కని పుట్టిన వారిని పుట్టినట్టుగానే మట్టుపెట్టడం తప్పుల్ని మించిన తప్పు. ఈ అపరాధ బాధితులందర్నీ ఉరికంబానికెక్కించాలి. చిత్రవధ చేయాలి. యవ్వన జీవితం అంటే రంగుల రాట్నమని, ప్రేమ ఫలించకపోయేటప్పటికి హత్యలూ, ఆత్మహత్యలూ చేసుకొనేవారి తల్లిదండ్రులను, ప్రేమికుల దినోత్సవమంటూ తిరిగే ఆడామగా కాముకులనూ కఠినంగా శిక్షించడమే గాకుండా, అందుకు ప్రోత్సహించేవారి నందర్నీ ఉరికంబాలకెక్కించాలి.

ప్రేమికుల దినోత్సవం జరుగనిస్తున్నందులకు ప్రభుత్వాన్నీ గర్హించాలి; గద్దె దింపాలి. పసిపాపల బ్రతుకులను ఆదిలోనే త్రుంచేసే ఘాతకుల నేమనాలి – మీరే చెప్పండి, మీరు చెప్పకపోతే నేను చెబుతాను **'వెధవలు – వెధవలు'.**

వెధవాయిలారా!

'అమ్మ' ఒక ఆడదే కదరా, అమ్మ లేకుండా మీరు పుట్ట కలిగేవారరా? అమ్మ పెంచనిదే పెరిగేవారా! అశుద్ధం అన్నం కలుపుకుని తినేవారు!

వయసొచ్చాక జీవితంలో 'తోడు'గ భార్య అక్కర్లేదంటారా? ఆ భార్య కూడా ఆడదే కదరా! ఆడది లేకుండా ఆడదైనా, మగవాడైనా పుడతాడంటారా? సృష్టి జరుగుతుందంటార్రా!

ఈ సృష్టిని సృష్టించినదొక ఆడది. ఆ ఆడదే మహాశక్తి. శక్తి లేనిదే శివుడు లేడు, జీవం లేదు.

'వందేమాతరమ్' ఎందుకంటున్నాం. ఆ తల్లి సృజించిన మనల్నీ, మన జీవనాధారపు నీరునీ, నారునీ, పంటల్నీ, ఫలాల్నీ, పుష్పాల్నీ, ఔషధుల్నీ, ఆచ్ఛాదనకు ధరించే వస్త్రాలనూ, ఆడంబరానికి ధరించే రత్న, మణి, మరకత, కాంచన రజితాల్నీ ఆ తల్లే యిచ్చిందిరా! 'వందేమాతరమ్' అంటూ ఆ తల్లికి వందనం చెప్పండి. వందనం చెప్పనివారి మెడలను విరవండి. ఆ తల్లి పేగు చించుకుని శిశు స్త్రీ రూపంగా పుట్టి తల్లులౌతూ సృష్టికార్యం కొనసాగిస్తున్న త్యాగశీలురైన చిట్టితల్లులను చంపకండి. భ్రూణహత్యలు చేయకండి. చేయించకండి! ●

## సమాచార పౌర సంబంధాల శాఖా కమీషనర్

# బి.వెంకటేశం! ఐ.ఏ.ఎస్



క్రొత్త సమాచార, పౌర సంబంధ శాఖా బాధ్యతల్ని తీసుకున్న తరువాత శ్రీ.బి.వేంకటేశం ఐ.ఏ.ఎస్ అధికారి, కమీషనర్ కార్యాలయంలో కల ఉద్యోగులందర్నీ కలిసారు. డైరెక్టర్ శ్రీ ఏ.సుభాష్‌గౌడ, శ్రీ వేంకటేశంకు అధికారగణాన్నందరినీ పరిచయం చేశారు. శ్రీ వేంకటేశ్ పదవీ స్వీకారం చేయగానే 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రి కలో ప్రభుత్వ సమాచార బులిటన్ గాకుండా కొన్ని కొన్ని పఠనీయమైన అంశాలనూ, కథలనూ చేర్చారు. ఐదు అంశాల ప్రణాళికగా శాఖాభివృద్ధి చేయాలని సంకల్పించారు. అలాగే ఆంధ్రదేశంలోనూ, ఆంధ్రేతర ప్రాంతా ల్లోనూ తెలుగుకు కృషి చేస్తున్న చిన్న చిన్న పత్రికలను బి.వెంకటేష్ ప్రోత్సహిస్తారని విశ్వసిస్తాను. ●


**Statement about ownership and other particulars about Newspaper**
**"PRAMUKHANDRA" Chennai - 600 004.**
**FORM IV (See Rule 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Chennai |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | Printed at **Goteti Graphics** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 4. | Publisher's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 5. | Editor's Name | : | **G.S. RAMARAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 6. | Name & Address of individuals who own the Newspaper and Partners | : | **GV RAO** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 29-3-2012 **(Sd.,) GV RAO**

Chennai - 600 033. PUBLISHER



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



77

## పదకొండవవ అధ్యాయము - విశ్వరూప సందర్శన యోగము

**24.** నభఃస్పృశం దీప్తమనేకవర్ణం
వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్
దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాన్తరాత్మా
ధృతిం న విన్దామి శమం చ విష్ణో.

**25.** దంష్ట్రాకరాలాని చ తే ముఖాని
దృష్ట్వైవ కాలానల సన్నిభాని
దిశో న జానే న లభే చ శర్మ
ప్రసీద దేవేశ జగన్నివాస.

**26.** అమీచ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః
సర్వే సహైవావనిపాలసఙ్ఘైః
భీష్మో ద్రోణస్సూతపుత్ర స్తథాఽసౌ
సహాస్మదీయైరపి యోధముఖ్యైః.

**27.** వక్త్రాణి తే త్వరమాణా విశన్తి
దంష్ట్రాకరాలాని భయానకాని
కేచిద్విలగ్నా దశనాన్తరేషు
సందృశ్యన్తే చూర్ణితైరుత్తమాఙ్గైః.

**వ్యాఖ్య:** పరమాత్మయందు భూత భవిష్యద్వర్తమానకాలభేదము లేదు. కాలాతీతుడగు భగవానునియందు కాలమునకు సంబంధించిన విభేదములుగాని, విభజనలుగాని ఉండనేరవు. కనుకనే భవిష్యత్తునందు జరుపబోవునదియంతయును వర్తమానమందే విశ్వరూపమున అర్జునకు గోచరించుటకు కారణమైనది. భీష్మద్రోణకర్ణాది కౌరవపక్షవీరులు, మరియు పాండవపక్షమువారు భవిష్యత్కాలమున మృతినొంది కాలగర్భమున ప్రవేశించుటగని అర్జునుడు విశ్వరూపమున స్పష్టముగ గాంచగల్గెను. దీని భావమేమి? భూతభవిష్యద్వర్తమానములన్నియు పరమాత్మయందు ఒకటే. గడచిన అనేకయుగములకాలము. రాబోవు అనేకయుగములకాలము పరమాత్మ యందు వర్తమానకాలమేయగును. అతడు కాలాతీతుడు. కాలకాలుడు. కాలము వారియందు కల్పింపబడినది.

ఈ శ్లోకమందు వ్యక్తమొనర్పబడిన భావములను బాగుగ విచారించి చూచినచో గొప్ప వైరాగ్యము జీవునియందుదయింపగలదు. ఏలయనిన, ప్రత్యక్షముగా కానుపించు భీష్మద్రోణాదులు తక్కిన వీరులు ఆ క్షణముననే భయంకరమగు కాలముయొక్క కరాళవదనమందు త్వరితముగ ప్రవేశించుచున్నట్లు అర్జునడెట్లు గాంచగల్గెనో ఆ ప్రకారమే ఇపుడు ప్రత్యక్షముగా గానుపించు ఈ బంధుమిత్ర దారాసుతాదులు, ధనధాన్యాదులు, భవనములు, క్షేత్రారామములు, సంపదలు అన్నియు కాలగర్భమున విలీనమైపోవునవేయనియు, నశ్వరములనియు, జీవుడు భావించుకొనవలెను. ఈ సత్యమును చక్కగ భావించుకొనినచో దృశ్యపదార్థములం దంతట వైరాగ్యభావ ముప్పతిల్లగలదు.

భవిష్యత్తును వర్తమానమున జూడగల్గుటయే జ్ఞానదృష్టి. రాబోవు మృత్యువును ఇప్పుడు భావించగల్గుటయే జీవుని విజ్ఞతయైయున్నది. అట్టి భవిష్యద్భావనచే, మృత్యుచింతనచే, జీవుడు వైరాగ్యోపేతుడై జీవితమును జాగ్రత్తగా నడుపు కొనగలడు. అత్తఱి భోగాదులం దాతనికి విరక్తియు, భగవంతునియందు భక్తియు ఉదయించును. మరణము సంభవింపకమునుపే లక్ష్యప్రాప్తినొందవలెను దృఢనిశ్చయము కలుగజేసికొని అందులకై తీవ్రతరముగ ప్రయత్నించును.

కాబట్టి విశ్వరూపమున అర్జునుడు చూడగల్గిన భవిష్యత్కాలచిత్రమును ప్రతిముముక్షువు తన హృదయవీథియందు చిత్రించుకొని, వైరాగ్యయుక్తుడై లక్ష్యమగు పరమాత్మ ప్రాప్తికై అనవరతము యత్నము గావించుచుండవలెను.

**29.** యథా ప్రదీప్తం జ్వలనం పతఙ్గా
విశన్తి నాశాయ సమృద్ధవేగాః
తథైవ నాశాయ విశన్తి లోకా
స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః.

**30.** లేలిహ్యసే గ్రసమానస్సమన్తా
ల్లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః
తేజోభిరాపూర్య జగత్సమగ్రం
భాసస్తవోగ్రాః ప్రతపన్తి విష్ణో.

**31.** ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో
నమోఽస్తు తే దేవవర ప్రసీద
విజ్ఞాతుమిచ్ఛామి భవన్తమాద్యం
న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్.

**వ్యాఖ్య:** భగవంతుని గుఱించి తెలిసికొనదలంచువాడు అర్జునునివలె వినయాన్వితుడై, భక్తిభావసమన్వితుడై యుండవలెను.

అర్జునుని ప్రశ్నలకు భగవానుడు సమాధానమొసంగుచున్నాడు-

**32.** కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో
లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః
ఋతేఽపి త్వా న భవిష్యన్తి సర్వే
యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః.

**33.** తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ
జిత్వా శత్రూన్ భుఙ్క్ష్వ రాజ్యం సమృద్ధమ్
మయైవైతే నిహతాః పూర్వమేవ
నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్.

**వ్యాఖ్య:** 'నిమిత్తమాత్రం భవ'- ప్రపంచములోని సమస్తకార్యములున్ను భగవంతుని చేతనే చేయబడుచున్నవి. జీవులు నిమిత్తమాత్రులే యగుదురు. కాని అజ్ఞానులగు జనులు 'నేను చేసినాను' అను కర్తృత్వమును గలిగియుండుచు తత్ఫలితముగ బద్ధులై దుఃఖమునొందుచున్నారు. 'ఓ అర్జునా! నీ శత్రువు లిదివఱకే నాచే హతులైరి. నీవిపుడు నిమిత్తమాత్రముగ యుద్ధము చేసి విజయమునొందుము,' అని భగవానుడర్జునునకు బోధించిరి. దీనిని బట్టి ఈ జగత్తునందలి సమస్తము భగవంతునిచే చేయబడుచున్నదనియు, జీవులు భ్రాంతిలోపడి, దీనిని బట్టి ఈ జగత్తునందలి సమస్తము భగవంతునిచే చేయబడుచున్నదనియు, జీవులు భ్రాంతిలోపడి, అహంభావముగలిగి వ్యర్థముగ తమపై కర్తృత్వమును విడనాడి అంతయు భగవానుడే చేయుచున్నాడని భావించి తాను లోకవ్యవహారమున నిమిత్తమాత్రుడై యుండవలెను. దానిచే నిరహంభావము, తత్ఫలితముగ నిర్మలభావము, భగవదనుగ్రహము అతనికి లభించగలవు.

'సవ్యసాచిన్'- అర్జునుడు ఎడమ చేతిలో గూడ బాణములను ప్రయోగింపగల సామర్థ్యము గలవాడని యర్థము.

- (తరువాయి వచ్చే సంచికలో)